కాళీపట్నం వంతెన నిర్మాణం పూర్తి

- వేగంగా నిర్మాణ పనులు
- త్వరలోనే రోడ్డు నిర్మిస్తామంటున్న అధికారులు


పూర్తయిన కాళీపట్నం వంతెన


శిథిలావస్థకు చేరిన కాళీపట్నం వంతెన (ఫైల్)

మొగల్తూరు: నియోజకవర్గంలో ఉన్న కాళీపట్నం వంతెన పనులు పూర్తయ్యాయి. కాళీపట్నం తూర్పు నుంచి పడమర మీదుగా పాతపాడు వరకూ రహదారి, కాళీపట్నం కాలువపై వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు నిధులు మంజూరయ్యాయి. దీంతో గతేడాది రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శంకుస్థాపన చేశారు. అయితే ఈ ఏడాది మార్చిలో పరిపాలనా అనుమతులు రావడంతో రహదారి, వంతెన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ముదునూరి ప్రసాదరాజు ఆదేశించారు. దీంతో ముందుగా వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేశారు.

రూ.12 కోట్లు మంజూరు

కాళీపట్నం నుంచి జగన్నాథపురం వయా పాతపాడు వరకూ వెడల్పు చేసి రహదారి నిర్మాణానికి, కాళీపట్నం కాలువపై రెండు లైన్ల వంతెన నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరయ్యాయి. దీంతో 8మీటర్లు– 3.50 మీటర్ల మేర కల్వర్టు వేసి, పది మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మాణం చేపట్టారు.

కాళీపట్నం వాసుల చిరకాల కోరిక

సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన కాళీపట్నం వంతెన శిథిలావస్థకు చేరడంతో నూతనంగా వంతెన నిర్మించాలని కాళీపట్నం తూర్పు, పడమర గ్రామస్తులు అనేక సార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అధికారంలోకి వచ్చిన వెంటనే ముదునూరి ప్రసాదరాజు గ్రామాల్లోని సమస్యలపై దృష్టి సారించారు. దీనిలో భాగంగా చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు శిథిలావస్థకు చేరిన వంతెనను తొలగించి నూతన వంతెనకు నిధులు మంజూరు చేశారు. ముందుగా వంతెన పనులు పూర్తి చేసిన అధికారులు రోడ్డు నిర్మాణం పనులు కూడా త్వరలో పూర్తి చేస్తామని చెబుతున్నారు.

నిత్యం రద్దీగా ఉండే వంతెన

కాళీపట్నం రెవెన్యూ గ్రామాల ప్రజలతో పాటు కృష్ణా జిల్లాలోని చిన్న గొల్లపాలెం, గొల్లపాలెం, లక్ష్మీపురం గ్రామాల ప్రజలకు కాళీపట్నం మీదుగా నరసాపురం, భీమవరం వెళ్లేందుకు ఇదే అనువైన రహదారి. దీంతో కాళీపట్నం మీదుగా నిత్యం నరసాపురం డిపో నుంచి బస్సులతో పాటు కొబ్బరి, సరుగుడు, చేపలు లోడు వాహనాలు, విద్యాసంస్థల బస్సులు తిరుగుతుంటాయి. వంతెన పూర్తికావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా పనులు



నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ వంతెన నిర్మాణం పూర్తి కావడంతో మొగల్తూరు మండలంలోని వారితో పాటు కృష్ణా జిల్లా వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రహదారి పనులు కూడా త్వరలో పూర్తి చేస్తాం

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్‌విప్

ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు



గ్రామంలోని సమస్యలపై అవగాహన ఉన్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను ప్రసాదరాజు పరిష్కరించారు. మా గ్రామస్తులతోపాటు కృష్ణా జిల్లా వాసులకు అనువుగా ఉంటుంది.

– కవురు ఆదినారాయణ, కాళీపట్నం పడమర

వ్యక్తిపై కేసు నమోదు

ఉండి: విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగితో అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం కలిగొట్ల గ్రామంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న పాలా రాఘవ ఉణుదుర్రు గ్రామానికి కూడా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గత కొద్దిరోజుల క్రితం ఉణుదుర్రు గ్రామానికి చెందిన గొల్ల పుష్పలత అనే మహిళ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నారు. పాస్‌పోర్టు ఎంక్వయిరీలో భాగంగా ఈనెల 2వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో దరఖాస్తుదారు తమ్ముడు తణుకుల సామేలు అనే వ్యక్తికి మహిళా పోలీస్ ఫోన్ చేసి వివరాలు అడిగారు. వివరాలు సేకరిస్తున్న క్రమంలో ఆమెతో సామేలు అసభ్యకరంగా మాట్లాడిన కారణంగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జన్మరాహిత్యం కోసం ధ్యానం చేయాలి

అత్తిలి: మాయ అనే మత్తు నుంచి బయటపడి శ్రద్ధను పెంచుకుంటే ధ్యానులు కాగలరని భీమవరంకు చెందిన పిరమిడ్ మాస్టర్ పార్వతి అన్నారు. అత్తిలి పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జన్మరాహిత్యం కోసం ధ్యానం చేయాలని, సమయాన్ని అనవసర విషయాల కోసం వృధా చేయవద్దని కోరారు. కర్మ సిద్ధాంతం ప్రకారం పుట్టిన తర్వాత కర్మలను అనుభవించడం ద్వారా సూన్యస్థితికి చేరుకుని మోక్షాన్ని పొందవచ్చన్నారు. అత్తిలి పిరమిడ్ మాస్టర్ పంజా ప్రసాద్, దాసం వెంకట ప్రసాద్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీగణపతి హోమం


లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సంకటహర చతుర్థి సందర్భంగా లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో జరిగిన ఈ హోమంలో 18 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ సిబ్బంది, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెనుమంట్ర ఎస్సైగా మదీనా బాషా


ఎమ్మెల్యే రంగనాథరాజుతో ఎస్సై మదీనాబాషా

పెనుమంట్ర: పెనుమంట్ర పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎస్‌కే మదీనాబాషా బాధ్యతలు స్వీకరించారు. భీమవరం నుంచి బదిలీపై పెనుమంట్ర వచ్చిన ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా పెనుమంట్ర మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు చిత్త శుద్ధితో పని చేస్తానని స్పష్టం చేశారు.

తుందుర్రుకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

భీమవరం అర్బన్: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రజారంజక పాలన సాగిస్తున్నారని సర్పంచ్ ఆరేటి సత్య వెంకట వీరాస్వామినాయుడు (పెద్దబ్బు)అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో ప్రయాణికుల సౌలభ్యం కోసం భీమవరం –తుందుర్రు బస్ సర్వీసును సర్పంచ్ ఆరేటి పెద్దబ్బు జెండా ఊపి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా ముందు వరకు ఆర్టీసీ బస్ సర్వీసులు భీమవరం నుంచి తుందుర్రు నడిపేవారని తదానంతరం కరోనా కారణంగా నిలిపివేశారన్నారు. దీంతో తుందుర్రు, పెదగరువు, బేతపూడి, తాడేరు, వెంప, శ్రీరామపురం గ్రామాలతో పాటు నరసాపురం మండలంలో పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు జిల్లా కేంద్రం భీమవరం రావడానికి తీవ్ర ఇబ్బందులు పడడంతో ఈ సమస్యను ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే 4 బస్ సర్వీసులను వేయించారన్నారు. ఈ ప్రాంత ప్రజల కష్టాలను గుర్తించి పరిష్కరించిన ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్డు తాతాలు, మద్దా పోలు రాజు తదితరులు పాల్గొన్నారు.

85 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు

తణుకు టౌన్ : పట్టణంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా అందించే సేవలలో భాగంగా అఖిల భారత స్థాయిలో దివ్యాంగుల కోసం పని చేస్తున్న సక్షమ్ అభ్యర్థన మేరకు 85 మందికి దివ్యాంగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, డాక్టర్ సుంకవల్లి నీలు మహేంద్రలు సంచార వైద్యశాల ద్వారా 85 మంది దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి బాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధిలైట్ల ఏర్పాటులో ఎమ్మెల్యే వ్యాఖ్యలు తగవు


పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

పాలకొల్లు అర్బన్: టిడ్కో కాలనీలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చొరవ తీసుకుని, కాంట్రాక్టర్‌తో మాట్లాడి మునిసిపల్ నిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రాజకీయం చేయడం తగదని వైఎస్సార్ సీపీ పట్టణ, మండల నాయకులు చందక సత్తిబాబు, ఎం.మైఖేల్‌రాజు హెచ్చరించారు. ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఏడాది డిసెంబర్‌లో టిడ్కో కాలనీని సందర్శించిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ దృష్టికి కాలనీలో వాసులు వీధిలైట్లు సమస్య తీసుకువచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మునిసిపల్ సాధారణ నిధులు రూ.4.56 లక్షలతో వీధిలైట్లు ఏర్పాటుకు కమిటీ తీర్మానం చేసిందన్నారు. ఇదిలా ఉంటే నూతనంగా ఇన్‌చార్జ్‌గా నియమితులైన గుడాల గోపి టిడ్కో కాలనీని సందర్శించినప్పుడు కాలనీ వాసులు మరలా వీధిలైట్లు సమస్యను ప్రస్తావించడంతో అప్పటికప్పుడు కాంట్రాక్టరుతో మాట్లాడి వారం రోజుల్లోనే కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు పనులను పూర్తి చేశారన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే ఎమ్మెల్యే నిమ్మల గుడాల గోపిని ప్రస్తావిస్తూ తన జేబులో డబ్బులతో వీధిలైట్లు వేయించినట్లుగా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. పబ్లిసిటీ పిచ్చితో డ్రామాలు చేయడం ఎమ్మెల్యేకి అలవాటన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీ మంత్రిగా పనిచేసిన లోకేష్‌కి ఇప్పటికీ రాజకీయ పరిజ్ఞానం లేదని విమర్శించారు. గుడాల గోపిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, జోగి వెంకటేశ్వరరావు, నంబూరు శ్రీగంగా పవన్‌కుమార్, పార్టీ నాయకులు బళ్ల రాజశేఖర్, ధనాల శ్రీనివాస్, షేక్ చాంద్‌బీబీ, పైలా రాజశ్రీ, మాముడూరి నాగమణి, కాసా విజయ దుర్గాభవాని, న్యాయవాది కండిబోయిన భాగ్యశ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నిమ్మల వ్యాఖ్యలు హాస్యాస్పదం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: ఎవరు ఏ గొప్ప పనిచేసినా అందులో మనకి సంబంధం లేకపోయినా అవి నా వల్లే జరిగిందని గొప్పలు చెప్పుకునే నాయకుల్లో రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ఒకరైతే మన జిల్లాలో పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఒకరని వైఎస్సార్ సీపీ దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు యడ్ల తాతాజీ విమర్శించారు. ఆదివారం తాతాజీ తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సిగ్గులేకుండా మాట్లాడే నాయకులు ఉన్నారంటే వీళ్లిద్దరేనని ఎద్దేవా చేశారు. పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల గోపి టిడ్కో గృహాల్లో వీధి దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మునిసిపల్ అధికారులతో చర్చించి వెంటనే రూ.4.80 లక్షలతో విద్యుత్ దీపాలు వేయించారు. ఇన్ని రోజులు స్పందించలేని రామానాయుడు నేడు దీపాలు వెలిగిన వెంటనే బయటకు వచ్చి ఈ వీధి దీపాలు నేను చెబితేనే వచ్చాయని గొప్పలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గోరంత పనిని కొండంత పనిలా చూపించడమే తప్ప టీడీపీ ప్రభుత్వంలో రామానాయుడు నియోజకవర్గంలో చేసిందేమి లేదన్నారు. గత ఎమ్మెల్యే ఉషారాణి హయాంలో వచ్చిన నిధులకు సంబంధించిన పనులు రామానాయుడు హయాంలో పూర్తయ్యాయని మరి ఆ గొప్పతనం అంతా ఉషారాణికి ఇస్తారా? అని ప్రశ్నించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని దానికి ఎవ్వరూ బాధ్యులు కారని కనీసం ఈ సత్యం కూడా తెలియని ఎమ్మెల్యే నిమ్మల పీహెచ్‌డీ చేశానని చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో కొప్రగింజల శ్రీనివాసు, రేలంగి శ్రీనివాసు, ఉనికెల రాము, చెన్ను విజయ్, పిల్లా హనుమంతు, పెచ్చెట్టి కృష్ణాజీ, పిల్లా అప్పాజీ, కాపిశెట్టి శ్రీనివాసు, బిజిలి శ్రీను పాల్గొన్నారు.

పిల్లల విద్యాభ్యాసంపై దృష్టి పెట్టాలి


పెనుమంట్రలో సంచార జాతులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చింతపల్లి గురు ప్రసాద్

పెనుమంట్ర: సంచార జాతుల కుటుంబాలు తమ పిల్లలను భిక్షాటన వైపు కాకుండా విద్య వైపు మళ్లించాలని వైఎస్సార్‌సీపీ బహుజన కులాల నాయకుడు చింతపల్లి గురు ప్రసాద్ అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం రాత్రి పెనుమంట్రలోని సంచార జాతుల కుటుంబాలకు చెందిన వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ తాడిపర్తి ప్రయాంక అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి పేద విద్యార్థుల సంక్షేమానికి కృషిచేస్తుందని ఈ అవకాశాలను సంచార జాతుల కుటుంబాలు వినియోగించుకుని తమ పిల్లలను ఉన్నత విద్యకు చేరువ చేయాలని ఆయన కోరారు. ఆచంట నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా 50 మంది సంచార జాతులకు ఆయన సొంత ఖర్చులతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుమంట్ర, పాలకోడేరు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు గూడూరి దేవేంద్రుడు, పాలా రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ బోర్డు మెంబర్‌గా శేషుబాబు ప్రమాణస్వీకారం


తిరుమలలో టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు దంపతులను సత్కరిస్తున్న ఆలయ అధికారి

పాలకొల్లు అర్బన్: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యునిగా మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం శేషుబాబు–శశిరేఖ దంపతులను ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. టీటీడీ బోర్డు మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించిన శేషుబాబుకి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు నడపన గోవిందరాజుల నాయుడు వేర్వేరుగా అభినందనలు తెలిపారు.

అధికార దాహంతో చంద్రబాబు మోసపూరిత హామీలు


విలేకరులతో మాట్లాడుతున్న కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: భవిష్యత్‌కి గ్యారంటీ పేరుతో చంద్రబాబు బూటకపు వాగ్దానాలతో ప్రజల్ని మోసం చేయడానికి సిద్ధపడుతున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబు విమర్శించారు. పాలకొల్లు ఏఎంసీ అతిథి గృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే శ్రీలంకగా మారిపోతుందని విమర్శించిన టీడీపీ నేత చంద్రబాబు జగన్ కంటే మూడు రెట్లు అధికంగా సంక్షేమ పథకాలు ఇస్తామని హామీలివ్వడం ప్రజల్ని మోసం చేయడానికి తెరలేపుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే ధ్యేయంగా చంద్రబాబు ప్రజల్ని మోసం చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని మోసం చేశారని దుయ్యబట్టారు. సమావేశంలో ఉపసర్పంచ్ ఆకుల నాగమురళి, పార్టీ నాయకులు సాకా కమలాకర్, కొయ్యే భాస్కరరావు, దేవ రాజేష్‌కుమార్, దొమ్మేటి శ్రీను, అంగర రమేష్, ఉనికెల శ్రీనివాసరావు, ఏనుగుపల్లి సత్యకుమార్, పాలపర్తి కృపనాథ్, సోడదాసి చిట్టిబాబు, కొయ్యే వెంకటేశ్వరరావు, పేరూరి సన్నిబాబు, అడిదెల సుధాకర్, నాగాబత్తుల జాన్ పాల్గొన్నారు.

నేడు సీపీఎం ధర్నా

సాక్షి, భీమవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం తహశీల్దార్, ఆర్‌డీఓ కిర్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం నిత్యావసరాల అదుపునకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా చేపట్టే ధర్నాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బలరాం కోరారు.

విద్యార్థుల్లో మానవీయ విలువలు ప్రతిబింబించాలి


స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ యశ్వంత్ పాటిల్

సాక్షి, భీమవరం: విద్యార్థుల్లో మానవీయ విలువలు ప్రతిబింబించే విధంగా విద్యాబోధన చేయడం ద్వారా ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు కృషి చేయాలని మహారాష్ట్రకు చెందిన ప్రొఫెసర్ యశ్వంత్ పాటిల్ చెప్పారు. నూతన విద్యా విధానం 2020లో భాగంగా ఏఐసీటీఈ యూనివర్సల్ హ్యూమన్ వ్యాల్యూస్‌పై భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. కళాశాల ఇంజినీరింగ్ కెమిస్ట్రీ హెడ్ పి.భవాని, దివాకర్లు కోఆర్డినేటర్స్‌గా వ్యవహరించిన శిక్షణా కార్యక్రమంలో యశ్వంత్‌పాటిల్ మాట్లాడుతూ ప్రధానంగా విద్యారంగంలో ప్రతి విద్యార్థి తన టీచర్‌ను రోల్‌మోడల్‌గా తీసుకొని తన జీవన విధానాన్ని రూపొందించుకునే అవకాశాలు కల్పించాలన్నారు. ప్రస్తుత విద్యావిధానం నైపుణ్య ఆధారిత విధానంగా మారిందని అందువలన విద్యార్థులు వినూత్న ఆలోచనలతో పాటు సమాజానికి సేవ చేయాలనే విశాల దృక్పదాన్ని పెంపొందించుకునేలా చేయాలని యశ్వంత్‌పాటిల్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు, ప్రొఫెసర్ శ్రీజ మధు, ప్రొఫెసర్ చంద్రశేఖర్, ఆర్అండ్‌డి డీన్ పీఏ రామకృష్ణంరాజు, పి భవాని, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సేవలో సినీ నటుడు సురేష్



భీమవరం (ప్రకాశంచౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారిని సినీ నటుడు సురేష్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల అర్జున శర్మ సురేష్‌కు వేద ఆశీర్వాదం అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ బాబురావు తదితరులు పాల్గొన్నారు

డీఎన్నార్ డిగ్రీ పరీక్షా ఫలితాల విడుదల


భీమవరం డీఎన్నార్ కళాశాలలో డిగ్రీ పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: స్థానిక డీఎన్నార్ కళాశాల డిగ్రీ పరీక్షా ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. కళాశాలలో డిగ్రీ చదువుతున్న విద్యార్థుల 2,4,6 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఫలితాల్లో బీఏ 78 శాతం, బీఎస్సీ 64 శాతం , బీకాం 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. రీవ్యాల్యూయేషన్, జవాబు పత్రాల పరిశీలనకు విద్యార్థులకు సెప్టెంబర్ 4వ తేది నుంచి 8వ తారీకు వరకూ అవకాశం కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంత కుమారి, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డి.శ్రీనివాసరాజు, ఏఓ పి.రామకృష్ణంరాజు, పి.శిరీష్ కుమార్ పాల్గొన్నారు.

ఐలూ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహాలు

తణుకు: సివిల్ వివాదాలు పరిష్కరించే సమయంలో దస్తావేజులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించుకోవాలని న్యాయవాది కామన మునిస్వామి తెలిపారు. తణుకు పట్టణంలో ఆదివారం శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రంలో అఖిల భారత లాయర్స్ యూనియన్ (ఐలూ) ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సలహా కేంద్రం ద్వారా న్యాయసలహాలు అందజేశారు. దస్తావేజులను పరిశీలించుకుని వారి ముందు దస్తావేజుల్లో విక్రయదారుడు రాసిన సంగతులను తెలుసుకోవాలన్నారు.

తేతలి పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ


తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన తణుకు రూరల్ మండలం తేతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి, అయన సతీమణి మున్సిపల్ పాఠశాల ప్రదానోపాధ్యాయిని రుద్రమదేవిలు తమ పాఠశాలలో ప్రతీభావంతులైన 13 మంది విద్యార్థినీ, విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఆదివారం తేతలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బీఎం గోపాల రెడ్డి తండ్రి చెన్నారెడ్డి 11వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులు 13 మందికి అవసరమైన సైకిళ్లను గ్రామ సర్పంచ్ సరెళ్ల కాంతిప్రియ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గోపాల రెడ్డి, రుద్రమదేవి దంపతులు యూటీఎఫ్ భవన నిర్మాణానికి రూ. 24వేల విరాళాన్ని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీ జయకుమార్, జీ రవి, ఎస్ శివప్రసాదరాజులకు అందజేశారు. ఈసందర్భంగా గోపాలరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఆశయ సాధనలో బాగంగా ప్రతిభావంతులను ప్రోత్సాహించేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీ రంగయ్య, ఎం ఏడుకొండలు, పేరెంట్ కమిటీ అధ్యక్షురాలు ఏలూరి ఉమామహేశ్వరి, సుబ్రహ్మణ్యం, పుల్లారెడ్డి, నిర్మల్‌కుమార్, రామకృష్ణ, బుచ్చియ్య, ప్రకాశరావు, శ్రీనివాసు, దుర్గారావు పాల్గొన్నారు.